ప్రజాశక్తి

శుక్రవారం 8 నవంబర్ 2024

పార్వతీపురం మన్యం

అనారోగ్యం బారిన పడకుండా చర్యలు : డివిజి

విజయనగరంకోట : విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మృతిపట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతికి గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆశ్రమ పాఠశాల నిర్వహణ, నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసారు. ఒక్కరోజు వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన పరిస్థితులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు దోమ తెరలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలలో ఎటువంటి చర్యలు చేపట్టారో సమగ్ర నివేదికలను అందజేయాలని జిల్లాతో పాటు విజయనగరం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల నిర్వహణ, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై దృష్టి సారించాలని కోరారు.

ఆటో కూడా సమకూర్చలేదు

పిఒకు జీవన్ తండ్రి ఫిర్యాదు ● రూ.లక్ష సాయం అందజేత

జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ మృతిచెందడంపై ఆయన తండ్రి కృష్ణారావు గురువారం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవకి ఫిర్యాదు చేశారు. తన కుమారుడు జీవన్ కుమార్ మృతి చెందిన తర్వాత పాఠశాల యాజమాన్యం మృతదేహాన్ని తరలించేందుకు ఆటో కూడా సమకూర్చ లేదన్నారు. మృతదేహం తరలించనంత వరకు ఏవేవో మాటలు చెప్పారని, కనీసం దహన సంస్కారాలకు కూడా డబ్బులు చెల్లించలేదని చెప్పారు. తన భార్య మరణించిందని, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో జీవన్ కుమార్ తండ్రి కృష్ణారావుకు తక్షణ సాయం కింద లక్ష రూపాయల చెక్కుని పిఒ అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మరికొంత ఆర్థిక సహాయం అందేలా చూస్తామని పిఒ హామీ ఇచ్చారు.

తాము కొండకోనల్లో జీవిస్తూ, తమ పిల్లలకు మెరుగైన జీవితం అందించాలనే లక్ష్యంతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చేరుస్తున్న ఆదివాసీల ఆశలను ప్రభుత్వాలు చిదిమేస్తున్నాయి. కనీస మౌలిక సదుపాయాలు లేని గిరిశిఖర గ్రామాల్లో నివశించే గిరిజనులు తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం చదివిస్తున్నారు. కొడుకో, కూతురో పెద్ద చదువులు చదివి తమను ఉద్ధరిస్తారని, తమ కుటుంబాలకు అండగా ఉంటారని పెట్టుకున్న ఆశలు అడియాశలవుతున్నాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలకు అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు పడటం లేదు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ గాలిలో దీపంలా తయారైంది. విద్యార్థుల మరణాలు జరిగినప్పుడు విచారణ పేరుతో పాలకులు, అధికారులు హడావుడి చేయడం తప్ప అసలు కారణాలపై దృష్టి సారించడం లేదు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత జిల్లాలో విద్యార్థుల మరణాలు విస్మయానికి గురిచేస్తున్నాయి.

'చితి'కి పోతున్న ఆశలు

కమ్మేసిన పాలకుల, అధికారుల నిర్లక్ష్యం

ఐదు నెలల్లో ఏడుగురు విద్యార్థులు మృతి

గిరిపుత్రులకు గర్భశోకం మిగుల్చుతున్న వైనం

ప్రజాశక్తి-పార్వతీపురం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా గిరిజన సంక్షేమం గాడిలో పడిన దాఖలాలు లేవు. జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఏడుగురు గిరిజన విద్యార్థులు మృత్యువాత పడడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. కనీస మౌలిక సదుపాయాలు లేని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంరక్షణ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్‌కు కత్తిమీద సాములా తయారైంది. అసలే పోషకాహార లోపంతో ఆశ్రమ పాఠశాలల్లో చేరే విద్యార్థులలో రక్తహీనత ప్రధాన సమస్యగా మారుతోంది. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, పోషకాహార లోపాలపై చర్యలు మొక్కుబడిగా ఉండడంతో విద్యార్థుల మరణాలు పెరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

పార్వతీపురం మన్యం జిల్లాలో కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో రెండు రోజుల్లో ఇద్దరు గిరిజన విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందడం కలకలం సృష్టించింది. జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ రాత్రి నిద్రపోయిన తరువాత మరుసటి రోజు విగతజీవిగా మారడం ప్రశ్నార్థకంగా మారింది. ముందురోజు బాగానే ఉన్న జీవన్ కుమార్ మరుసటి రోజు నిద్రలోనే ప్రాణం వీడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గిరిజన, విద్యార్థి సంఘాలు.. ప్రభుత్వం తీరుపై భగ్గుమంటున్నాయి.

ఎఎన్ఎంల నియామకం అటకెక్కినట్లేనా?

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి.. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకానికి సంబంధించిన ఫైలుపై తొలి సంతకం చేశారు. దాదాపు ఐదు నెలలు కావస్తున్నా ఇంతవరకు ఎఎన్ఎంల నియామకం చేపట్టలేదు. గిరిజన పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతలు చూసుకునేందుకు ఎఎన్ఎంల నియామకం చేపట్టాలని ఎప్పటి నుంచో గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రకరకాల అనారోగ్య కారణాలతో, అంతుచిక్కని వ్యాధులతో గిరిజన విద్యార్థులు మృత్యువాత పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు కనీస పరిహారం చెల్లించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం లేదు.

ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

కురుపాం : గిరిజన విద్యార్థుల మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. గురువారం కురుపాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న నిమ్మక జీవన్ అనే విద్యార్థి మృతిచెందడం పట్ల విచారం వ్యక్తంచేశారు. ఇటీవల కాలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏడుగురు విద్యార్థులు మరణించారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. వందల మంది విద్యార్థులతో ఉన్న హాస్టళ్లలో వారి ఆరోగ్యాన్ని, యోగక్షేమాలను చూసుకోవడానికి కనీసం హాస్టల్‌కు ఒక ఎఎన్ఎంను నియమించక పోవడం సిగ్గుచేటన్నారు. గిరిజన విద్యార్థులన్నా, వారి ప్రాణాలన్నా ప్రభుత్వానికి అంత చులకనా? అని నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్‌చేశారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, నాయకులు మండంగి అడ్డమేశ్వరరావు, వి.వాసు, అంగద పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలను అదుపుచేయాలి

గుమ్మలక్ష్మీపురం : గిరిజన విద్యార్థుల మరణాల అదుపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్, కోశాధికారి మండంగి రమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాల సంఖ్య పెరుగుతున్నా ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోవడంతో పసిప్రాయంలోనే మృత్యుఒడికి చేరుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించక పోవడంతో విద్యార్థులకు మెరుగైన వైద్యం అందడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆరోగ్య కార్యకర్తలను నియమించి, స్థానికంగా విద్యార్థులు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

గిరిజన విద్యార్థి మృతిపై విచారణ

జియ్యమ్మవలస : మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ మృతిపై గురువారం డిఇఒ ఎన్.టి.నాయుడు, డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి విచారణ చేపట్టారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులను విచారించారు. రాత్రి పడుకున్న తర్వాత ఉదయాన్నే తోటి విద్యార్థి లేపాడని, అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్నాడని వారు వివరించారు. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు చెప్పారని తెలిపారు. అయితే ఆసుపత్రికి తీసుకెళ్లే సరికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని చెప్పారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని డిఇఒ తెలిపారు. కార్యక్రమంలో ఎటిడబ్ల్యుఒ చంద్రబాబు పాల్గొన్నారు.

దర్యాప్తు సక్రమంగా లేదు : సిపిఎం

గిరిజన విద్యార్థుల వరుస మరణాలపై దర్యాప్తు సక్రమంగా లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు, నాయకులు సీతారాం ఆందోళన వ్యక్తంచేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో, బాధితులకు ఆర్థిక సహాయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

– నియోజకవర్గంలో గిరిజన విద్యార్థులు మృత్యువాత పడడంతో ప్రజాప్రతినిధులుగా బాధితులకు ఏం సమాధానం చెప్పాలని ఎంపిపి బొంగు సురేష్.. అధికారులపై మండిపడ్డారు జీవన్ కుమార్ మృతిపై మంత్రి సంధ్యారాణి స్పందించి, తక్షణమే వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారని ఆయన తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపిపి స్పష్టంచేశారు.

ఆశ్రమ పాఠశాలలో విచారణ చేపడుతున్న డిఇఒ ఎన్.టి.నాయుడు, డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి

ఇంకెంతమంది చనిపోవాలి?

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

సాలూరు : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఇంకెంతమంది విద్యార్థులు చనిపోవాలని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రశ్నించారు. గురువారం సాలూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు నెలల్లో ఏడుగురు విద్యార్థులు మతి చెందడం టిడిపి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. జిల్లాలో వరుసగా రెండు రోజుల్లో ఇద్దరు విద్యార్థులు మతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఎన్నో ఆశలతో తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించిన గిరిజనులకు జరుగుతున్న నష్టాన్ని ఎవరు భరిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యార్థుల మరణాలపై ప్రభుత్వ హత్యలని వ్యాఖ్యలు చేసిన ప్రస్తుత మంత్రి సంధ్యారాణి ఇప్పుడు సంభవిస్తున్న చిన్నారుల మరణాలపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకానికి సంబంధించిన ఫైలుపై తొలి సంతకం చేసి ఐదు నెలలు దాటినా ఇంతవరకు అతీగతీ లేదన్నారు.

రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు టి.అఖిల్ డిమాండ్ చేశారు. వరుసగా విద్యార్థుల మరణాలు పాలకుల నిర్లక్ష్యాన్ని సూచిస్తున్నాయని విమర్శించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.పది లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు.

చదువు కోసం వెళ్తే చావులా?

పార్వతీపురంరూరల్ : చదువు కోసం ఆశ్రమ పాఠశాలలకు వెళ్లిన పిల్లలు చావుబారిన పడుతున్నారని జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు వంగల దాలినాయుడు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఆయన పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు జీవన్ కుమార్, నితిన్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఏటా ఈ సీజన్లో విద్యార్థులు మొగ్గల్లా రాలిపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం ఘోరమన్నారు. గతంలో పాలించిన వైసిపి, ఇప్పుడు పాలిస్తున్న కూటమి ప్రభుత్వాలు జిల్లాలోని ఐటిడిఎలను గాలికి వదిలేశాయని విమర్శించారు.

చలించని గిరిజన సంక్షేమ శాఖ

సాలూరు రూరల్ : విద్యార్థుల మరణాలపై గిరిజన సంక్షేమ శాఖలో చలనం లేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం సాలూరులో బాలుర, బాలికల కళాశాలల వసతిగృహాలను సిపిఎం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం కమిటీ ఏర్పాటుచేసి, కారణాలను తెలుసుకోవాలని డిమాండ్‌చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమిస్తామన్న గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి హామీ ఏమైందని నిలదీశారు. ప్రకటనకే పరిమితం కాకుండా, ఎఎన్ఎంలను వెంటనే నియమించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.ఇందు, విజయ్, శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు బాగుచేసుకుంటున్న గిరిజనులు

వెల్లివిరిసిన చైతన్యం

శ్రమదానంతో రహదారి నిర్మించుకున్న గిరిజనులు

ప్రజాశక్తి-సీతంపేట

వారంతా అమాయక గిరిజనులు. ఏళ్లతరబడి పాలకుల నిర్లక్ష్యం, అధికారుల చిన్నచూపుతో అభివృద్ధికి దూరమయ్యారు. ఏళ్ల తరబడి రోడ్డు కోసం పాట్లు పడ్డారు. పాలకులకు వినతులిచ్చారు. విజ్ఞప్తులు చేశారు. ఎవరూ స్పందించలేదు. చివరికి విసిగివేసారిన గిరిజనులు శ్రమదానానికి సిద్ధమయ్యారు. చేయి చేయి కలిపి రోడ్డు నిర్మించుకున్నారు.

మండలంలోని పెదరామ పంచాయతీ పరిధిలోని గ్రామం.. మొగదారగూడ. సీతంపేట ఐటిడిఎకు కూతవేటు దూరంలో ఉంది. ఈ గ్రామానికి మొగదార నుంచి వెళ్లే మార్గం రాళ్లు తేలడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. అధికారులకు అనేకసార్లు విన్నవించారు. గ్రీవెన్స్‌లో అర్జీలు పెట్టుకున్నారు. రోడ్డు సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఈ గ్రామంలో విషజ్వరాలు ఏటా విజృంభిస్తున్నాయి. అత్యవసర సమయంలో రోడ్డు బాగోలేకపోవడంతో అంబులెన్స్ సైతం రావడం లేదు. అధికారుల తీరుతో విసిగిపోయిన గిరిజనులు గురువారం శ్రమదానంతో రోడ్డు బాగుచేసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పక్కా రహదారి నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

అధికారుల పల్లెనిద్ర

ప్రజాశక్తి-పాచిపెంట

జిల్లాలోని గిరిజన, సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల శాఖల ఆధ్వర్యంలోని అన్ని వసతి గృహాలను బలోపేతం చేసేందుకు జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పల్లె నిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పల్లె నిద్రలో భాగంగా పాచిపెంట మండలం పి.కోనవలసలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల వసతి గృహాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న విద్యా ప్రమాణాలు, నాణ్యమైన పోషకాహారం, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, కిచెన్ గార్డెన్, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే నిర్భయంగా తమకు తెలియజేయాలని, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాత్రికి విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి

పి.కోనవలసలో బస చేసిన కలెక్టర్

చూసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహాల పర్యవేక్షణ పెంచుతామని, జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణను కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తామని కలెక్టర్ చెప్పారు. విద్యార్థుల్లో జ్వర బాధితులను, రక్త పరీక్షలు నిర్వహించిన రికార్డులను నిశితంగా కలెక్టర్ పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందులను యాంటీబయాటిక్ మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే వసతి గృహంలో కలెక్టర్ బస చేశారు.

జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పల్లె నిద్రలో జిల్లా పౌర సంబంధాలు, విద్య, వృత్తి విద్య, నైపుణ్య అభివృద్ధి, ఉద్యానవన, వ్యవసాయ, సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ అధికారులు, డ్వామా, డిఆర్‌డిఎ, వెలుగు పీడీలు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ, జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్, జిల్లా సూక్ష్మ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖాధికారులు, ఇతర జిల్లా అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలకు హాజరై, అక్కడే బస చేశారు.

పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన సంక్షేమ బాలుర గురుకుల వసతిగృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఈ కార్యక్రమంలో ఇపిడిసిఎల్ ఎస్ఇ చలపతిరావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కే శ్రీనివాసరావు, తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ జనార్ధన రావు, ప్రిన్సిపల్ పి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన

పల్లె నిద్ర కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తొలుత మండలంలోని అమ్మవలసలో ఉన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. బిస్కెట్లు తయారీ, పెట్టుబడి, ప్రస్తుత రాబడి తదితర వివరాలను యజమాని రామును అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ, మండల వ్యవసాయగా అధికారి కె.తిరుపతిరావు, తహశీల్దారు డి.రవి, స్వయం సహాయక సంఘ అధ్యక్షురాలు గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం.. వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణ

కురుపాం.. మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా బిసి సంక్షేమ అధికారి ఎస్. కృష్ణారావు

గుమ్మలక్ష్మీపురం.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వసతిగృహంలో వంటలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి గోపాలరావునాయుడు

విడిది కేంద్రం ఏర్పాటుతో ఏనుగుల సమస్యకు పరిష్కారం

డిఎఫ్ఒ ప్రసూన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఏనుగుల విడిది కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, దీనివల్ల గజరాజుల సమస్యకు పరిష్కారం లభిస్తుందని జిల్లా అటవీ శాఖాధికారి జి.ఎ.పి.ప్రసూన వెల్లడించారు. పంట నష్టం, ప్రాణ నష్టం, పశువుల మరణాల అవకాశాలను తగ్గించడం ద్వారా నిర్దిష్ట ప్రాంతంలో ఏనుగులను నిలువరించడం ఈ కేంద్రం లక్ష్యమని తెలిపారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం మండలం వెంకంపేట, చినబొండపల్లి, పెద్ద బొండపల్లి పరిసర ప్రాంతాలలో సంచరిస్తున్న ఏనుగుల గుంపును అటవీశాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏనుగుల సమస్యను పరిష్కరించడానికి అటవీశాఖ చేపడుతున్న చర్యల గురించి ఆమె వివరించారు. 2018 నుంచి ఇప్పటివరకు ఏనుగుల దాడుల వల్ల దాదాపు రూ.13 కోట్ల పంట నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. 3,500 ఎకరాల్లో సుమారు 4వేల మంది రైతులను ప్రభావితం చేసిందని తెలిపారు. ఏనుగులు ఆహారం, నీరు, నివాసం కోసం ప్రయాణించే సమయంలో వాటి కదలికలను అంచనా వేయడం కష్టతరమని తెలిపారు. పెదబొండపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అవాంఛనీయ సంఘటన దృష్ట్యా.. ప్రస్తుతం ఏనుగులు ఉన్నచోట పెద్ద సంఖ్యలో జనం గుమిగూడినందున ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించాలని తెలియజేశామన్నారు.

ఇటువంటి సమావేశాలు జంతువులను మరింత ఆందోళనకు గురిచేస్తాయని తెలిపారు. సంఘర్షణ ప్రమాదాన్ని పెంచుతాయని స్పష్టం చేశారు. అటవీ శాఖ ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తుందని, ఎలిఫెంట్ ట్రాకర్లను నియమించామని తెలిపారు. స్థానిక గ్రామస్తులను వెంటనే అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు.

'అంబులెన్సులు అందుబాటులోకి తెస్తాం'

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అంబులెన్సులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయపార్వతి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 13 అంబులెన్సులు ఉన్నాయని చెప్పారు. వాటిలో ఏడు అంబులెన్సులు పూర్తి కండిషన్లో ఉన్నాయని తెలిపారు. మూడు అంబులెన్స్‌లు వినియోగంలోకి తీసుకురావడానికి మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు. రెండు అంబులెన్స్‌లకు చిన్న మరమ్మతులు చేయించాల్సి ఉందని చెప్పారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకున్నామని వివరించారు.

జాబ్‌మేళాకు 45 మంది హాజరు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో వైటిసిలో నిర్వహించిన జాబ్ మేళాకు 45 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఐటిడిఎ ద్వారా చేపడుతున్న జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ చిన్నబాబు, వెలుగు డిపిఎం ఆర్.వి.రమణ, బొల్లినేని మెడి స్కిల్స్ ప్రతినిధి నాగేశ్వరరావు, ఇతర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకుంటాం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఎమ్మెల్సీ అభ్యర్థిగా శంబంగి నామినేషన్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

శాసనమండలి స్థానిక సంస్థల విజయనగరం ఎమ్మెల్సీ స్థానాన్ని తిరిగి నిలబెట్టు కుంటామని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైసిపి అభ్యర్థిగా శంబంగి వెంకట చినప్పలనాయుడు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ కు తన నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఎస్.వి.చిన అప్పల నాయుడుతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాస్ మూర్తి తదితర అధికారులు నామినేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు 743 మంది ఉన్నారని, వారిలో 590 మంది వరకు తమ పార్టీకి చెందిన వారు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, జెడ్‌పిటిసి సభ్యులు, కార్పొరేటర్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



మంత్రి మనోహర్‌కు వినతి అందిస్తున్న జనసేన నాయకులు

మంత్రి దృష్టికి కిడ్నీ బాధితుల సమస్య

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని నిడగల్లు గ్రామంలో కిడ్నీ బాధితుల సమస్యలను మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి జనసేన నాయకులు తీసుకెళ్లారు. గురువారం అమరావతిలో జనసేన నాయకులు ఆడాడ మోహనరావు ఆధ్వర్యాన మండల నాయకులు మంత్రిని కలిసి సమస్యను విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి కూడా తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పైల సత్యనారాయణ, అల్లు రమేష్, సీతానగరం మండల అధ్యక్షుడు శ్రీను, సీనియర్ నాయకులు రెడ్డి కరుణ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పోస్టల్ ఖాతాదారులంతా ఆధార్ నంబరును అనుసంధానం చేసుకోవాలని డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ అనుసంధానం కాకపోవడంతో ప్రభుత్వ ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చే డబ్బులు అకౌంట్లో జమకావడం లేదని చెప్పారు. ఈ సమస్యను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ప్రతి ప్రాంతీయ సచివాలయ పరిధిలోని పోస్ట్ ఆఫీస్ ద్వారా ఐపిపిబి అకౌంట్స్ ప్రారంభించి, ఆధార్ సీడింగ్, ఎన్‌పిసిఐ లింక్ చేసుకోవాలని కోరారు. మన్యం జిల్లా పరిధిలో 445 పోస్ట్ ఆఫీసుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఈ నెల 15వ తేదీ వరకు ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'జమిలి'కి వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

జమిలి ఎన్నికల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని కోరుతూ పాచిపెంటలో గాంధీ బొమ్మ వద్ద గురువారం సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రాలకు ఎటువంటి హక్కులూ లేకుండా చేసేందుకు ప్రధాని మోడీ ఇటువంటి ఆలోచన చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల రాష్ట్రాలు అభివృద్ధి చెందవని తెలిపారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని మోడీ చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇటువంటి ఆలోచన మానుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు, కె.కళ్యాణ్, జె.రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 18 మంది ఎంపిక

ప్రజాశక్తి-మక్కువ

అండర్-14, 19 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాల నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రత్నకుమారి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన విజయనగరం, కర్నూలులో జరిగిన పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరిని ప్రిన్సిపల్, విద్యా కమిటీ చైర్మన్ ఎస్.భారతి, పీడీ మోహన్ రావు అభినందించారు.

గిరిజన అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన అభివృద్ధికి ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అప్పారావు, సాయికుమార్, గంగాధర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గిరిజన గ్రామ రహదారులకు 2016 నుండి ప్రతిపాదనలు చేసినా, టెండర్ల ప్రకారం పూర్తి చేయని కాంట్రాక్టర్లు ఉన్నారని తెలిపారు. అయినా ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గిరిజనుల కన్నీటి బాధలు అధికారులకు పట్టడం లేదని మండిపడ్డారు. వెంటనే రహదారుల నిర్మాణాలు చేపట్టకుంటే ఐటిడిఎ ఎదుట వంటావార్పు చేపడతామని హెచ్చరించారు.

వసతిగృహాల్లో మరమ్మతులకు అంచనాలు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల మరమ్మతు పనుల కోసం అంచనాలను రూపొందించాలని ఎపిడబ్ల్యుఐడిసి ఇఇని కోరినట్లు జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఎస్.కృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ ఆదేశాలతో మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు కోరామని, నివేదిక వచ్చామని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి

ప్రజాశక్తి-కొమరాడ

రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధరకు ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా నాయకులు కె.సాంబమూర్తి డిమాండ్‌చేశారు. గురువారం కొమరాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాణ్యత పేరుతో కొర్రీలు వేయకుండా, తడి, పొడి ధాన్యం మద్దతుధరకు కొనాలన్నారు.

మధుమేహంపై ఆశాలకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మధుమేహం-చికిత్సపై ఆశా వర్కర్లకు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఆయుష్ మిషన్ వైద్యాధికారి ఎం.సి ఫెయిత్ ఫుల్ అన్నారు. గురువారం మండలంలో నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు జాతీయ ఆయుష్ మిషన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సాధారణ వ్యాధులతో పాటు మధుమేహానికి అందించాల్సిన వైద్యసేవలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో మొదటగా అందుబాటులో ఉండేది ఆశావర్కర్లేనని, వారే ముఖ్యంగా గిరిజనుల ఆరోగ్యాల గురించి తెలుసుకొని నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అమరసింహారెడ్డి, సిబ్బంది శ్రీహరిరావు, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా నీటి సంఘాల ఎన్నికలు

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను సజావుగా నిర్వహించాలని, ఇందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సూచించారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలపై సబ్ కలెక్టర్లు, ఇఇలు, తహశీల్దార్లతో గురువారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈనెల 10న గ్రామ పంచాయతీ, మండల పరిషత్, తహశీల్దారు కార్యాలయాల్లో ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచుతారని తెలిపారు. వాటిపై అభ్యంతరాలను 11, 12వ తేదీల్లో సంబంధిత తహశీల్దార్లు స్వీకరిస్తారని తెలిపారు. అభ్యంతరాల అనంతరం 13న జాబితా సిద్ధం చేస్తారని, వాటిపై కూడా అభ్యంతరాలు ఉంటే 14, 15వ తేదీల్లో పాలకొండ,

మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం సబ్ కలెక్టర్లు స్వీకరిస్తారని కలెక్టర్ చెప్పారు. స్వీకరణ అనంతరం సిద్ధం చేసిన జాబితాను జిల్లా కేంద్రానికి పంపిస్తారన్నారు. వీటిపై కూడా అభ్యంతరాలు ఉంటే 18 నుంచి 20వ తేదీ లోగా కమిషనర్, సిఎడిఎ, జలవనరుల శాఖ, విజయవాడ వారికి తెలియజేయవచ్చని చెప్పారు. 20వ తేదీ తుది జాబితా సిద్ధం అవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతీ ఓటరు నోటిఫికేషన్ తేదీ నాటికి రెవెన్యూ రికార్డుల ప్రకారం భూమి కలిగి ఉండాలన్నారు. పోలింగ్ సమయంలో పాస్ బుక్, అడంగల్, 1బి తదితర గుర్తింపు ప్రతితో హాజరుకావాల్సి ఉందని, మండల పరిధిలోని గ్రామ రెవెన్యూ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈ విషయమై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఓటర్ల జాబితాపై చేపట్టిన చర్యలను పాలకొండ, పార్వతీపురం సబ్ కలెక్టర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాత్సవ, యశ్వంత్ కుమార్ రెడ్డి, జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సవర కళల అభివృద్ధికి కృషి

ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట

రాష్ట్ర హ్యాండీ క్రాఫ్ట్ శాఖ సహకారంతో సవర కళల అభివృద్ధికి కృషి చేస్తామని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం సీతంపేటలోని పిఎంఆర్‌సిలో సవర కళల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణలో సవర కళలకు సంబంధించిన చిత్రకళను నేర్పించి, దాని అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణకు 25 మందిని ఎంపిక చేశామని, వారికి నెల రోజులపాటు శిక్షణ ఇస్తామని అన్నారు. ఈ శిక్షణలో లేపాక్షి సంస్థ సహకారం కూడా తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సవర కళల చిత్రాలను పిఒ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ చిన్నబాబు, వెలుగు డిపిఎం ఆర్.వి.రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సవర భాషాపుస్తకాలు పంపిణీ

మండలంలో దారిమల్లి గిరిజన సంక్షేమ జిపిఎస్ పాఠశాలలో సవర మాతృభాష గల విద్యార్థులకు పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకాల ద్వారా పాఠాలను సులభంగా నేర్చుకొని అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎపిఒ చిన్నబాబు, డిప్యూటీ ఇఒ నారాయుడు, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, హెచ్‌ఎం రామచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సవర కళలను పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్

గర్భిణులకు పోషకాహారం అందించాలి

సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో స్థానిక వైటిసిలో నిర్వహిస్తున్న గిరిజన గర్భిణుల వసతిగృహాన్ని పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గర్భిణులకు రుచికరమైన పోషకాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులకు అక్కడ అందుతున్న వైద్య సేవలు, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను డిఇఒ తిరుపతి నాయుడు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రార్థన జరుగుతున్న సమయంలో విద్యార్థుల ప్రవర్తన పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పలు మౌఖిక ప్రశ్నలను వేశారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, డైరీలు, టీచింగ్ నోట్స్ పరిశీలించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించడానికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒలు సత్యనారాయణ, రాధాకృష్ణమూర్తి, చంద్రశేఖర్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని జోగింపేట గురుకులాన్ని జిల్లా ఉద్యాన శాఖాధికారి కెఎస్ వరప్రసాద్ గురువారం రాత్రి సందర్శించారు. పాఠశాల ఆవరణ, డార్మిటరీ, తరగతి గదులు, భోజనశాలను పరిశీలించారు. కొన్ని తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు పనిచేయకపోవడాన్ని గుర్తించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ భోజనాలు, వసతులు ఎలా ఉన్నాయని ఆరాతీశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మధుబాబు, వైస్ ప్రిన్సిపల్ ఈశ్వర రావు, టిడిపి నాయకులు బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

హామీల అమలుపై నిలదీయండి

ప్రజాశక్తి-వీరఘట్టం

హామీల అమలుపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు కోరారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో డిసెంబర్ 4న విజయవాడలో చేపట్టే ప్రజా హక్కుల సభ, ర్యాలీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వి.శంకర్, బి.బంగారరావు, జి.సూర్యారావు, డి.సూర్యకళ, సిహెచ్ ఝాన్సీ, జె.జ్యోతి పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో కేన్సర్‌కు అడ్డుకట్ట

డిఎంహెచ్‌ఒ విజయపార్వతి

సీతానగరం.. ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అవగాహన, ముందస్తు పరీక్షలతో కేన్సర్ ముప్పు నుంచి జాగ్రత పడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి తెలిపారు. కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కార్యాలయ ప్రాంగణంలో గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సిడి 3.0 సర్వేలో భాగంగా కేన్సర్ స్క్రీనింగ్‌ను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అన్ని ప్రాథమిక,గ్రామీణ ఆరోగ్య కేంద్రాల పరిధిల్లో గురువారం కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అనంతరం ఆశా నోడల్ అధికారుల సమావేశం నిర్వహించి పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహనరావు, రఘుకుమార్, వినోద్ కుమార్, డెమో యోగీశ్వరరెడ్డి, డిపిహెచ్‌ఎన్ ఉషారాణి, డిపిఒ లీలారాణి, ఎస్‌ఒ శంకర్, డిసిఎం విజయలత, వైద్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

సీతానగరం : మండలంలోని సీతానగరం, పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్లు రాధాకాంత్, ఉషారాణి, పావని ఆధ్వర్యంలో అందరికీ క్యాన్సర్ పరీక్షలు అన్న దానిపై వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుండి మండలంలో ఉన్నటువంటి 18 ఏళ్ల దాటిన ప్రతి పౌరులకు ఈ క్యాన్సర్ పరీక్షలు వారి ఇంటి వద్ద వైద్య ఆరోగ్య సిబ్బంది చేయుటకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది ముఖ్యంగా మగవాళ్లలో నోటికి క్యాన్సరు ఊపిరితిత్తుల క్యాన్సర్ పేగు క్యాన్సరు ఇటువంటి వాటిని ప్రాథమిక దశలోనే గుర్తించడం అలాగే 18 సంవత్సరాలు దాటిన ఆడవాళ్లకు బ్రెస్ట్ క్యాన్సర్ గర్భాశయ క్యాన్సర్ నూటికి ఆన్సర్ ఇవి వారి ఇంటి వద్ద తనిఖీలు చేయటం అనుమానం ఉన్న వాళ్ళని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపి వైద్యాధికారి వారిచే తనిఖీలు చేయించడం జరుగుతుంది. ముఖ్యంగా ప్రజల్లో ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో సూర్యనారాయణ. సిహెచ్‌ఓ ఎస్ వెంకటరమణ. స్టాఫ్ నర్స్ సత్యవతి.వరలక్ష్మి తో పాటు ఏ ఎన్ ఎం లు. ఆశ వర్కర్ల. ఎం ఎల్ హెచ్ పి లు. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్‌ఎడిపై అవగాహన

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

రోడ్డు ప్రమాదాల నివారణకు రూపొందించిన ఐఆర్‌ఎడి కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఆసుపత్రిలో గురువారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ అధ్యక్షులు ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించామని ఐఆర్‌ఎడి మేనేజర్ ఎం.శ్రీధర్ అన్నారు. రోడ్డు ప్రమాదాల కారణాలను విశ్లేషించడం, ప్రమాదాలను తగ్గించడానికి భద్రతా చర్యలు రూపొందించడంలో సహాయపడే సెంట్రల్ యాక్సిడెంట్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అభివృద్ధి చేసిందన్నారు. ఎన్ఐసి ద్వారా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఐఆర్‌ఎడి మొబైల్ అప్లికేషన్ ఫొటోలు, వీడియోలతో పాటు రోడ్డు ప్రమాదాల వివరాలను నమోదు చేయడానికి పోలీసు సిబ్బందికి సహాయకారిగా ఉంటుందని, వాటిపై పూర్తి పరిజ్ఞానం పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, రవాణా శాఖ మెడికల్ ఆఫీసర్ పి.నారాయణరావు, రీజనల్ మెడికల్ అధికారి శేషగిరి, జిల్లా పోలీస్ సిబ్బంది, ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ప్రజాశక్తి-పాచిపెంట

మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

కొత్తవలస రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, కొనుగోలు ఏజెన్సీలకు ధాన్యం కొనుగోలుపై సివిల్ సప్లై టెక్నికల్ అసిస్టెంట్ గణేష్ ఆధ్వర్యంలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ తేమ శాతం విషయంలో రైతులకు సరైన సూచనలు అందించాలన్నారు. సాధారణ రకం ధాన్యం క్వింటాకు రూ. 2,300 గ్రేడ్ -ఎ రకానికి రూ.2320 మద్దతుధరగా నిర్ణయించినట్లు తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ గణేష్ మాట్లాడుతూ తేమశాతం 17 శాతం కంటే తక్కువ ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డేటా ఎంట్రీ ఆపరేటర్ సతీష్, విఎఎ పాల్గొన్నారు

మెలకువలు పాటిస్తే తెగుళ్లను నివారించవచ్చు

జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్

ప్రజాశక్తి-వీరఘట్టం

సాగులో మెలకువలు పాటిస్తే తెగుళ్లను నివారించవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని సంత నర్సుపురం రైతు సేవా కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయనప మాట్లాడారు. గ్రామంలో ఎంటియు 1318 రకం పంటకు నల్లకంకి, ఎర్ర కంకి తెగుళ్లను పరిశీలించారు. ఎదవల్ల పంట ఏపుగా పెరగడం వల్ల తెగుళ్ల సోకినట్లు ఆయన తెలిపారు. ఈసారి పంటలో మార్పు చేసి దూరం దూరంగా ఉబాలు వేయడంతోపాటు కాలిబాట కూడా వేస్తే తెగుళ్ల చేరవని, ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం పాలకొండ ఎడి రత్నకుమారి, ఎఒ సౌజన్య, ఎఇఒ కృష్ణకాంత్, రైతులు పాల్గొన్నారు.

కేళీల ఏరివేత ముఖ్యం

పాచిపెంట : విత్తనోత్పత్తికి మూడుసార్లు కేళీలను ఏరివేయాలని, దీనివల్ల నాణ్యమైన విత్తనం తయారవుతుందని వ్యవసాయ శాఖ ఎడి ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఎస్.గౌరీపురం గ్రామంలో ఎపి సీడ్స్ విత్తన ఉత్పత్తి కోసం వరి నాటిన రైతులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ విత్తనాన్ని తామే తయారు చేసుకోవచ్చని చెప్పారు. పిలక దశ, కంకి దశ, కోతకు ముందు.. ఇలా మూడుసార్లు కేళీలు ఏరివేస్తే నాణ్యమైన విత్తనం తయారవుతుందని చెప్పారు. నాణ్యమైన విత్తనానికి పొటాష్ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వరిలో పచ్చదోమ ఆశించిందని, నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. సుడిదోమ, పాముపొడ తెగులు ఆశించే అవకాశం ఉందని తెలిపారు. దుబ్బుల మొదళ్లలో దోమను పరిశీలించాలని చెప్పారు. అనంతరం రైతులు మాట్లాడుతూ జింకు, జిప్సం, బోరాన్లను, వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ తిరుపతిరావు, ఎపి సీడ్స్ సిబ్బంది లావణ్య, పుష్పలత పాల్గొన్నారు.

బీమాతో కార్యకర్తలకు భరోసా

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూదేవి

ప్రజాశక్తి-వీరఘట్టం



టిడిపిలో చేరిన వారితో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి

టిడిపి సభ్యత్వ నమోదు ద్వారా బీమా సౌకర్యం కల్పించడంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి తెలిపారు. గురువారం మండలంలోని చలివేంద్రి గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయం నెరవేరాలంటే ప్రతిఒక్కరూ పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా హుస్సేనుపురం, సంతనర్సిపురం, దశమంతపురం గ్రామాల నుంచి వైసిపి కార్యకర్తలో భూదేవి సమక్షంలో టిడిపిలో చేరారు. మాజీ జెడ్‌పిటిసి సామంతుల దామోదర్‌రావు, సీనియర్ నాయకులు ఖండాపు వెంకటరమణమూర్తి, పోరెడ్డి వెంకట నాయుడు, ఎస్ సుదర్శన్, గుమ్మడి సింహాద్రి, జంపు చంద్రశేఖర్, సాసబిల్లి బుజ్జి, డి.లక్ష్మణరావు, సుక్క శ్రీనివాసరావు, పిన్నింటి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సిరికుమార్

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-సీతంపేట

జగద్గురు పీఠం అంతర్జాతీయ అధ్యక్షులు పార్వతి కుమార్ 80వ జన్మదిన వేడుకలను గురువారం భారతి ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో శ్రీవాల్మీకి వనవాసి శ్రేయో సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఆదాయపన్నుల కమిషనర్ సిరికుమార్ చేతుల మీదుగా 400 మంది వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవాల్మీకి వనవాసి శ్రేయం సంస్థ అధ్యక్షులు పెంటయ్య, భారతి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ నవీన్ కుమార్, భాస్కర్ రావు, హడ్డుబంగి యూత్ పాల్గొన్నారు.

బేకరీ షాప్ సీజ్

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేటలోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న స్వీట్ బేకరీ షాపు సీజ్ చేసినట్లు తహశీల్దార్ పి.అప్పలరాజు తెలిపారు. ఈ షాపు స్థలం కోర్టులో ఉందని తెలిపారు. నోటీసులు ఇచ్చినా నిర్మాణం చేపట్టి షాపు ప్రారంభించడంతో సీజ్ చేసినట్లు చెప్పారు.

సమస్యలపై 104 సిబ్బంది వినతి

ప్రజాశక్తి- సీతానగరం

తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది తహశీల్దారు ఉమా మహేశ్వరరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 సిబ్బంది మాట్లాడుతూ 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, కుటుంబాలను పోషించటం చాలా కష్టమవుతోందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే పిహెచ్‌సిల ద్వారా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చప్పా ప్రసాదరావు, ఈశ్వర రావు, నవీన్, రాజు పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు ఆశ్రయం

ప్రజాశక్తి-పాచిపెంట

నిరుపేద మహిళకు మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ ఆశ్రయం కల్పించింది. పాచిపెంట మండల కేంద్రంలో ఎరుకల వీధిలో గొర్లె సంగమ్మ అనే మహిళ ఒంటరిగా జీవిస్తోంది. ఆమె సిమెంట్ ఇటుకలతో ఓ చిన్న గదిని నిర్మించుకుంది. ఆ గదికి పైకప్పు రేకులు వేయడానికి స్తోమత లేక మధ్యలోనే వదిలేశారు. వర్షం వచ్చినప్పుడు ఆమె నిత్యావసర సరుకులు, గృహ పరికరాలు తడిసిపోతున్నాయి. ఆ సమయంలో పక్కింట్లోకి వెళ్లి ఆమె తలదాచుకుంటున్నారు. ఆమె రిబ్బన్లు, బెలూన్లు, దువ్వెనలు ఊరూరా తిరిగి అమ్ముకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఈ విషయం మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ దృష్టికి వచ్చింది. దీంతో దాతల సహాయంతో ఆమె ఇంటికి రేకులు ఏర్పాటుచేశారు. అసోసియేషన్ అధ్యక్షులు ఇప్పిలి దిలీప్‌కుమార్, బృందం పి.నరేష్‌కుమార్, వి.క్రీస్తు రాజు, ఎడ్ల మహేష్, బుజ్జి, బి.గణపతి పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలు

ప్రజాశక్తి- సీతానగరం

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా మండలంలో వరి పంటలో 32 ఇన్సూరెన్స్ యూనిట్లలో 128 పంట కోత ప్రయోగాలు చేపడుతున్నారు. అందులో భాగంగా గురువారం మండలంలోని పణుకుపేటలో ఎఒ అవినాష్, ఎఎస్‌ఒ సతీష్ ఆధ్వర్యాన పంటకోత ప్రయోగం చేపట్టారు. ఇప్పటివరకు మండలంలో 35 పంట కోత ప్రయోగాలు చేపట్టినట్లు ఎఒ తెలిపారు. వరి సంపత్ రకంలో ఎకరాకు 28 బస్తాలకు పైగా దిగుబడి వస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విఎఎ జగదీష్ పాల్గొన్నారు.

జిసిసి గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

కాలుతున్న నరమామిడి చెక్క

మండలంలో మొండెంఖల్ జిసిసి గోడౌన్‌లో గురువారం అగ్నిప్రమాదం ప్రమాదం సంభవించింది. గోడౌన్‌లో ఉన్న నరమామిడి చెక్కకు మంటలు వ్యాపించాయి. జిసిసి సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. దీంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే చాలా బస్తాలు కాలిపోయాయి. సుమారు రూ.15 లక్షలు వరకు నష్టం జరిగినట్లు జిసిసి మేనేజర్ వి.మహేంద్ర కుమార్ అంచనా వేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ గోపాలరావు నాయుడు తెలిపారు. కురుపాం నుండి గుమ్మలక్ష్మీపురం వరకు 33 కెవి లైన్లో జంగిల్ క్లియిరెన్స్, విద్యుత్ మరమ్మతులు చేస్తామని తెలిపారు. గుమ్మలక్ష్మీపురం, కేదారిపురం, మొండెంఖల్ ఫీడర్లలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిట్టిపూడివలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలస గ్రామంలో గురువారం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతోపాటు మధుమేహం, రక్తపోటు తదితర రకాలైన రోగులను తనిఖీ చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.